క్లుప్తంగా

వైభవంగా గణపతి కల్యాణం



భక్తులకు భోజనాలు ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులు

యర్రగొండపాలెం: స్థానిక కొలుకుల సెంటర్‌లో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయకుడి కల్యాణం సోమవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా దంపతులు యాగం చేసి ప్రత్యేక పూజలు చేశారు. గణపతి కల్యాణం సందర్భంగా భక్తులకు చేసిన భోజన ఏర్పాట్ల కోసం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ రూ.60 వేలు కమిటీ సభ్యులకు అందజేశారు.

నేటి నుంచి ప్రత్యేక పారిశుధ్య పనులు

● దర్శి నగర పంచాయతీ కమిషనర్

దర్శి: కేంద్ర ప్రభుత్వం మరియు రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలను అనుసరించి స్వచ్ఛతా హీ సేవా 2024 కార్యక్రమంలో భాగంగా స్వభావ్ స్వచ్ఛత, సంస్కార్ స్వచ్ఛత లక్ష్యంగా దర్శి నగర పంచాయతీలో 15 రోజులపాటు ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ జరుగుతందని మున్సిపల్ కమిషనర్ మహేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్యంపై ప్రజలను భాగస్వామ్యం చేయటం, అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. పార్కులు శుభ్రపరచుట, ఓవర్‌హెడ్ ట్యాంకులు శుభ్రపరచుట, పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు హెల్త్ చెకప్ చేయించడం, కార్మికులకు వారికి సంబంధించిన ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యాపార, వర్తక సంఘాల వారు, స్వయం సహాయక సభ్యులు, సచివాలయ సిబ్బంది, వైస్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు మరియు కో ఆప్షన్ సభ్యులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

పెద్దదోర్నాల: పేకాడుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నగదును స్వాధీనం చేసుకున్న సంఘటన సోమవారం యడవల్లిలో జరిగింది. ఈ సంఘటనలో గ్రామానికి చెందిన ఏడుగురిని అదుపులోకి తీసుకోవడంతో పాటు వారి నుంచి 1650 రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై మహేష్, రైటర్ మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం



వరద బాధితులకు సాయం అందిస్తున్న క్రీస్తు సంఘ సభ్యులు

పెద్దదోర్నాల: విజయవాడ వరద ముంపు బాధితులకు మండలానికి చెందిన క్రీస్తు సంఘం సభ్యులు సోమవారం నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా విజయవాడలోని వాంబే కాలనీ, వైఎస్సార్ కాలనీల్లోని పలువురు ముంపు బాధితులకు బియ్యం, కిరాణా సరుకులు, కూరగాయలు అందజేశారు. విజయవాడకు చెందిన స్తువార్తికులు గొల్లపూడి జోసఫ్ మైకేల్, పెద్దదోర్నాలకు చెందిన చాట్ల ఇర్మియా, చాట్ల గంగయ్య, చిలక కోటయ్య, పులకూరి పెద్ద యోహాను తదితరులు పాల్గొని భాదితులకు సాయం అందజేశారు.

సొంత నిధులతో చిల్లకంప తొలగింపు



చిల్లచెట్లు తొలగిస్తున్న జేసీబీ

తర్లుపాడు: మండలంలోని లక్ష్మక్కపల్లి ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం జగన్‌బాబు సొంత నిధులతో గ్రామంలోని రహదారికి ఇరువైపులా ఉన్న చిల్లకంపను తొలగించారు. కొద్దిరోజులుగా రహదారి వెంట ప్రయాణించే పలువురు చిల్లకంపతో రోడ్డు సరిగా కనపడక ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. విషయాన్ని గుర్తించిన హెచ్‌ఎం జగన్‌బాబు చిల్లకంపను తొలగించినట్లు వివరించారు. హెచ్‌ఎం సేవాభావాన్ని గ్రామస్తులు కొనియాడారు.

రైలు కిందపడి మృతి చెందిన వ్యక్తిది బేస్తవారిపేట

కంభం: కంభం–జేబీకే పురం మధ్యలో శనివారం రాత్రి రైలుకింద పడి మృతి చెందిన వ్యక్తి బేస్తవారిపేట అంబేద్కర్ కాలనీకి చెందిన ఆర్లగడ్డ అల్లూరయ్య గా గుర్తించినట్లు మార్కాపురం రైల్వే ఏఎస్సై ఎ. వెంకట్రావు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి వికలాంగుడని, అనారోగ్యంతో బాధపడుతున్నట్లు ఆయన తెలిపారు. శుక్రవారం ఇంట్లో నుంచి వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదని, సోషల్ మీడియా, పేపర్లలో చూసి కుటుంబ సభ్యులు మృతదేహాన్ని గుర్తుపట్టారన్నారు. కంభం ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం చేసిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మాకు మీరు..మీకు మేము!

● ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి



పసుపుగల్లులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, పక్కన బూచేపల్లి వెంకాయమ్మ

ముండ్లమూరు (దర్శి): కూటమి ప్రభుత్వ వేధింపులు తట్టుకునేందుకు మాకు..మీరు, మీకు మేము అండగా నిలిచి ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి ఆదివారం రాత్రి అన్నారు. మండలంలోని పసుపుగల్లులో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద ప్రత్యేక పూజలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు ఎప్పుడు ఎలాంటి కష్టం వచ్చినా అండగా నిలిచి ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. రాజకీయాల్లో పదవులు వస్తుంటాయి.. పోతుంటాయని, పదవుల కోసం రాజకీయాలు చేయడం బూచేపల్లి కుటుంబానికి తెలియవన్నారు. తమకు తెలిసిందిల్లా ఒక్కటే.. ప్రజలకు నీతి నిజాయితీగా సేవ చేయడమేనన్నారు. మా కోసం..పార్టీ కోసం కష్ట పడి చేసే ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో నిఖార్సయిన రాజకీయాలు చేసే దమ్మున్న ఏకైక నాయకుడు జగనన్న ఒక్కడేనన్నారు. గతంలో కష్టపడి అధికారంలోకి వచ్చామని, మళ్లీ మరో నాలుగేళ్లు కష్టపడితే మన జగనన్న ముఖ్యమంత్రి అవడం ఖాయమన్నారు. మనకు అధికారం వచ్చాక మనందరం సుఖంగా సంతోషంగా ఉంటామన్నారు. జెడ్పీటీసీ తాతపూడి రత్నరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుంకర బ్రహ్మారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ మేడికొండ జయంతి, సర్పంచ్‌ల సంఘ మండల మాజీ అధ్యక్షుడు చింతా శ్రీనివాసరెడ్డి, ఉప సర్పంచ్ బిజ్జం కృష్ణారెడ్డి, నాయకులు బాలకోటిరెడ్డి, కోటిలింగారెడ్డి, మదార్‌వలి, ఉల్లి హనుమంతరావు, కైపు వెంకటేశ్వరరెడ్డి, ఏపీ మోడల్ స్కూల్ మాజీ చైర్మన్ బిజ్జం సుబ్బారెడ్డి, కైపు వినోద్, పాలెం బాలకృష్ణారెడ్డి, పుచ్చా రవీంద్రారెడ్డి, యనుముల శ్రీనివాసరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలువురికి ఎమ్మెల్యే బూచేపల్లి పరామర్శ



ఆసుపల్లి చెన్నారెడ్డిని పరామర్శిస్తున్న బూచేపల్లి



రోజమ్మ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి

కురిచేడు: ఇటీవల అకాల మరణం చెందిన పలువురు వైఎస్సార్ సీపీ కార్యకర్తల కుటుంబ సభ్యులను సోమవారం దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి పరామర్శించారు. వారితో పాటు గంగదొనకొండ గ్రామ నాయకుడు ఆసుపల్లి చెన్నారెడ్డి ఇటీవల వెన్నునొప్పికి ఆపరేషన్ చేయించుకున్నారు. ముందుగా ఆయన్ను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన ఆరోగ్యం గురించి వాకబు చేశారు. కురిచేడులో జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనరు షేక్ సైదా సోదరుడు ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా కల్పించారు. అనారోగ్యంతో ఉన్న మాజీ ఎంపీటీసీ వద్దె మాలకొండయ్యను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కాటంవారిపల్లెలో మాజీ సొసైటీ ప్రెసిడెంటు పోతిరెడ్డి నాగిరెడ్డి బావ కైపు వెంకటేశ్వరరెడ్డి అకాల మరణం చెందటంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు ఆసుపల్లి భాస్కరరెడ్డి, ఆసుపల్లి నారాయణరెడ్డి, గంగదొనకొండ సర్పంచ్ ఆసుపల్లి రామలక్ష్మమ్మ, జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు పోతిరెడ్డి నాగిరెడ్డి, గోగులముడి లింగారెడ్డి, నుసుం వెంకటనాగిరెడ్డి, ఊట్ల వెంకటేశ్వర్లు, మేరువ పిచ్చిరెడ్డి, నారు శ్రీనివాసరెడ్డి, జేసీఎస్ కన్వీనరు మేరువ సుబ్బారెడ్డి, నుసుం ప్రతాపరెడ్డి, వీరగంథం కోటయ్య, మండల కన్వీనరు వైవీ సుబ్బయ్య, కొలూరి నర్సింహులు, ఎంపీటీసీ బుల్లం వెంకట నర్సయ్య, సర్పంచ్ కేసనపల్లి కృష్ణయ్య, రమణారెడ్డి, వెంకటరెడ్డి, సయ్యద్ హుస్సేన్, అన్నెం అమరనాథరెడ్డి, అందె సుబ్బారెడ్డి, లక్కిరెడ్డి సుబ్బారెడ్డి, పుల్లారెడ్డి, సుబ్బయ్య, పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పి.పెద్దయ్య, షేక్ మస్తాన్‌వలి, బి.ఆంజనేయులు, బయ్యవరం సర్పంచ్ మాలెపాటి నాగేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దొనకొండ: స్థానిక ఓబ్బాపురానికి చెందిన పాకనాటి దావీదు భార్య రోజమ్మ నాలుగు రోజుల క్రితం మృతి చెందింది. సోమవారం దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి వారి ఇంటి వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. తాను ఉన్నానంటూ భరోసా ఇచ్చారు. ఖర్చుల కోసం రూ.20 వేల నగదు అందజేశారు. ఆయన వెంట కర్నాటి ఆంజనేయరెడ్డి, గుంటు పోలయ్య, ఎంపీటీసీ గుంటు అజయ్, మండల కోఆప్షన్ షేక్ గఫార్, తాటిగిరి మధన్, పిక్కిలి అంకయ్య, పులిమి శివ, ఎస్‌పీపీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

చెరువుల వద్ద పొంచి ఉన్న ప్రమాదం



పెద్దారవీడు చెరువు కట్టపై మార్జిన్ లేని రోడ్డు



చెరువుకట్ట మూలమలుపు వద్ద కోతకు గురైన రోడ్డు

పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడు సమీపంలో చెరువు కట్టపై రహదారి అంచున పొంచి ఉన్న ప్రమాదం. రోడ్డు మార్జిన్లు దిగేటప్పుడు వాహనాలు చెరువుకు ఇరువైపులా కింద పడిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఈ రహదారిపై లారీలు, ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలు, ఆటోలు, కార్లు నిత్యం పదుల సంఖ్యలో రాకపోకలు చేస్తుంటాయి. ఏళ్ల తరబడి ఉన్న అధికారులు శాశ్వత పరిష్కరం చేయడం లేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా వాహనాలు అదుపు తప్పితే చెరువు కట్ట రోడ్డుకు ఇరువైపులా దాదాపు 15 అడుగుల లోతులో పడిపోయే ప్రమాదం ఉంది. రోడ్డుకు ఇరువైపులా మార్జిన్లు వర్షానికి కోతకు గురై ఉన్నాయి. మార్జిన్లు కనిపించకుండా రోడ్డుకు ఇరువైపులా చిల్లకంపతో మూసుకొని ఉంది. రోడ్డు ఇరుకుగా ఉండటంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు తప్పించుకోవాలంటే డ్రైవర్లు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహన ప్రమాదాలు, ప్రాణ నష్టాలు జరగకముందే అధికారులు మేల్కొని రోడ్డును వెడల్పు చేసి రెయిలింగ్ ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

వధూవరులకు బూచేపల్లి ఆశీర్వాదం



గంగదేవిపల్లిలో వధూవరులతో బూచేపల్లి

దొనకొండ: మండలంలోని పలు వివాహాలకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి సోమవారం హాజరయ్యారు. వెంకటాపురంలో వైఎస్సార్ సీపీ నాయకులు కొంగలేటి మోషే కుమారుడు వివాహానికి హాజరై వధూవరులు జాన్‌వెస్లీ, నిస్సీలను అక్షింతలు వేసి దీవించారు. గంగదేవిపల్లిలో వధూవరులు అల్లూరి చిన్న కిష్టయ్య, మేరిజ్యోతి వివాహానికి హాజరై ఆశీర్వదించారు. కొచ్చెర్లకోటలో వధూవరులు వినుకొండ శేఖర్‌బాబు, ప్రియాంకల వివాహానికి హాజరై అక్షింతలు వేసి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి దీవించారు. వారి వెంట ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి, కర్నాటి ఆంజనేయరెడ్డి, వెన్నపూస చెంచిరెడ్డి, గొంగటి పోలిరెడ్డి, చీరాల ఇశ్రాయేలు, వినుకొండ కొండలరావు, పత్తికొండ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

మార్కాపురం విద్యార్థికి ఎంబీబీఎస్ సీటు



మోహన్‌పూర్ణ (ఫైల్)

మార్కాపురం: మండలంలోని వేములకోట గ్రామానికి చెందిన గుంజే మోహన్ పూర్ణ కౌన్సిలింగ్‌లో ఎంబీబీఎస్‌లో ఉచిత మెడికల్ సీటు సాధించారని జ్ఞానశ్రీ నీట్ అకాడమీ డైరెక్టర్ ఎం.మల్లికార్జునరావు తెలిపారు. అమలాపురంలోని కోనసీమ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ కళాశాలలో సీటు దక్కినట్లు చెప్పారు. తండ్రి రాములు వ్యవసాయ కూలీ. ఉచిత మెడికల్ సీటు రావడంపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

పేద ముస్లింలకు స్వీట్ల పంపిణీ



స్వీట్లు అందిస్తున్న సీఐ సుబ్బారావు, ఎస్సై సైదుబాబు

మార్కాపురం: మిలాద్ నబీ పండగను పురస్కరించుకుని పట్టణ సీఐ పి. సుబ్బారావు పేద ముస్లిం విద్యార్థులకు సోమవారం స్వీట్లు అందించారు. పలువురు ముస్లింలకు, వృద్ధులకు మసీదు వద్దకు వెళ్లి స్వీట్లు పంచి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ మిలాద్ నబీ పండగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈయన వెంట పట్టణ ఎస్సై సైదుబాబు, సిబ్బంది ఉన్నారు.

గణనాథునికి అన్నా ప్రత్యేక పూజలు



అన్న వితరణ ప్రారంభిస్తున్న అన్నా రాంబాబు

మార్కాపురం టౌన్: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణనాథులకు సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేసి నిమజ్జనానికి తరలించారు. పట్టణంలోని బొగ్గరపు వారి వీధిలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అన్నా రాంబాబు, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్న వితరణ కార్యక్రమం ఆయన ప్రారంభించారు. పీఎస్ కాలనీ, భగత్‌సింగ్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. పట్టణంలోని కోనేటి వీధిలో గణనాథుడిని సోమవారం ప్రత్యేక పూజలు చేసి నిమజ్జనానికి తరలించారు. భక్తుల కోలాహలం, సందడి మధ్య గణేష్ నిమజ్జనం వైభవంగా జరిగింది. సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేసి విఘ్నేశ్వరుడి ఊరేగింపు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు ఉత్సాహంలో పాల్గొన్నారు.

రేపటి నుంచి కంభంలో మండల స్థాయి ఆటల పోటీలు

కంభం: కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, అండర్ 17 విభాగంలో ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖాధికారి మాల్యాద్రి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, యోగా, బ్యాడ్మింటన్ పోటీలు మండల స్థాయిలో జరుగుతాయని అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. 2011 జనవరి 01వ తేదీ తర్వాత జన్మించిన వారు అండర్ 14 విభాగంలో, 2008 జనవరి 01 తర్వాత జన్మించిన వారు అండర్ 17 విభాగంలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థుల వయస్సు ధ్రువీకరణ పత్రం, ఇతర నిర్ధారణ పత్రాలతో హాజరుకావాలన్నారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలతో సహా గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ



మొక్కలు నాటుతున్న నిర్వాహకులు

గిద్దలూరు రూరల్: మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్‌జీఓ హోమ్ ఆవరణలో సోమవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి.ఎస్‌నారాయణరెడ్డి, ముస్లిం నాయకులు యాకూబ్ ఖాన్, హబీబ్‌ఖాన్, రసూల్, షేక్.మదార్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నిరసనను జయప్రదం చేయాలి

● ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

దర్శి: నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై ఎస్సైల వేధింపులను నిరసిస్తూ మంగళవారం దర్శి పోలీసుస్టేషను ఎదుట ఉదయం 10 గంటలకు నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

తాళ్లూరు (దర్శి): దర్శి నియోజకవర్గం పరిధిలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై ఎస్ఐల వేధింపులు, దాడులను నిరసిస్తూ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం చేపడుతున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తూము వెంకట సుబ్బారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం పది గంటలకు దర్శి పోలీస్‌స్టేషన్ వద్ద జరిగే నిరసన కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

సీతారం ఏచూరికి ఘన నివాళి



సీతారం ఏచూరికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ముండ్లమూరు (దర్శి): సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభ సోమవారం మండలంలోని రాజగోపాలరెడ్డి నగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నాయకులు పంటా ఏడుకొండలు అధ్యక్షతన నిర్వహించిన సభలో సీతారం ఏచూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కన్వీనర్ వెల్లంపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం తుదిశ్వాస వరకు పోరాడిన మహనీయుడంటూ ఆయన సేవలను కొనియాడారు. మరణానంతరం తన శరీర అవయవాలను ప్రయోగం కోసం మెడికల్ కాలేజీకి దానం చేసి డాక్టర్ చదివే విద్యార్థులకు ఉపయోగపడేలా చేసినట్లు పేర్కొన్నారు. అట్టడుగు వర్గాల హక్కుల కోసం నిరంతరం రాజీ లేని పోరాటాలు చేసిన నేత సీతారం ఏచూరి అని తెలిపారు. సీపీఎం నాయకులు బోడపాటి హనుమంతరావు, ఆశా వర్కర్ల యూనియన్ మండల కార్యదర్శి కత్తి తిరుపతమ్మ, మండే దాసు, శ్రీనివాసరెడ్డి, చిరంజీవి, పద్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న సంస్థ సభ్యులు

పెద్దదోర్నాల: మహ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకుని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో జరిగిన అన్నదాన కార్యక్రమానికి కార్యక్రమానికి భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు పూల బాబు మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో మహ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా పేదలు, యాత్రికులు, ప్రయాణికులకు అన్నదానం ఏర్పాటు చేశారు. దీంతో పాటు మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కులమతాలకు అతీతంగా ఉచిత వైద్య శిబిరాలు, శ్రీశైలం వెళ్లే భక్తులకు సౌకర్యార్థం చలివేంద్రాలు, నిరుపేదలకు ఆర్థిక సాయం చేసినట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. ఉపాధ్యక్షులు షేక్ అబ్దుల్ కరీం, సెక్రటరీలు అల్లాబక్ష్, మహబూబ్‌బాష, కోశాధికారి వాజిద్, సభ్యులు చికెన్‌వలి, సుభానీ పాల్గొన్నారు.

మానవత ఆధ్వర్యంలో అంత్యక్రియలకు సాయం



చెక్కు అందజేస్తున్న సభ్యులు

పొదిలి: నగర పంచాయతీ పరిధిలోని నవాబ్‌మిట్టలో షేక్ ఖాదర్‌బీ అనారోగ్యంతో మృతి చెందింది. పేద కుటుంబం కావడంతో అంత్యక్రియల కోసం మానవత సేవా సంస్థ రూ.5 వేల సాయం అందజేశారు. ఈ మేరకు సోమవారం మృతురాలి భర్తకు రూ.5 వేల చెక్కు అందజేశారు. జిల్లా కన్వీనర్ కె.యల్లమందారెడ్డి, మండల కన్వీనర్ కల్లం వెంకట సుబ్బారెడ్డి, డైరెక్టర్ యక్కలి శేషగిరిరావు, కార్యదర్శి అశోక్ బండి, సంయుక్త కార్యదర్శి భూమా సుమంత్, శాంతి కమిటీ సభ్యులు ఎద్దు నగేష్, మీడియా ప్రతినిధి షేక్ బాజీ కరీముల్లా, సభ్యులు షేక్ యాసిన్, షేక్ షాహిద్, షేక్.మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

స్విమ్మర్ శ్రీనివాస్‌కు సన్మానం



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న భాస్కర్ దంపతులు

పొదిలి: మండలానికి చెందిన గోపనబోయిన శ్రీనివాస్ ఇటీవల నేపాల్లో జరిగిన అంతర్జాతీయ స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొని గోల్డ్ మెడల్స్ సాధించాడు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లా ఆర్యవైశ్య సంఘ మాజీ అధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, మాధవి దంపతులు శ్రీనివాస్‌ను సన్మానించారు. భాస్కర్ స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో శ్రీనివాస్‌ను శాలువా, పూలదండలతో ఘనంగా సన్మానించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని వారు ఆకాంక్షించారు. వాసవి క్లబ్ నాయకులు సోమిశెట్టి శ్రీదేవి, సోమిశెట్టి చిరంజీవి, సామి రాజా, మాజీ ఉప సర్పంచ్ షేక్ జిలానీ, షేక్ కమర్, షేక్ సలీం, మండల ఎస్సీ సెల్ నాయకులు ఎద్దు నగేష్ పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అడ్డంకి కలిగిస్తే కఠిన చర్యలు



సూచనలిస్తున్న సీఐ సుబ్బారావు, సిబ్బంది

మార్కాపురం: పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సుబ్బారావు హెచ్చరించారు. పట్టణంలోని నెహ్రూ బజారు, స్టూడియో బజారు, మార్కెట్ సెంటరు, మున్సిపాలిటీ ఏరియా తదితర ప్రాంతాల్లో రోజూ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతున్న నేపథ్యంలో ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించారు. వివిధ షాపుల వద్ద రోడ్లపై అడ్డంగా పెట్టిన వాహనదారులను పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చారు. పలు హోటళ్లు, టీ షాపులు, మెడికల్ షాపులు, కిరాణా షాపుల వద్ద పార్కింగ్ లేకున్నా వాహనాలను నిలిపి తమ వ్యక్తిగత పనులపై వెళ్లిన వాహనాదారులను పిలిపించి మాట్లాడారు. షాపుల ముందు ఎవరూ వాహనాలు పెట్టడానికి వీల్లేదని హెచ్చరించారు. ఆయన వెంట పట్టణ ఎస్సై సైదుబాబు ఉన్నారు.